




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 26-7-2025

సంపుటి: 21 సంచిక: 106

పేజీలు: 8 వెల: రూ.1



## అమృతమూర్తికి అశ్రునివాళి



ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు
ప్రతీకలై మా అందరి హృదయాలలో
చిరస్మరణీయమైన స్థానం సంపాదించిన
నీవు మమ్ములను వీడి దైవసన్నిధికి చేరావు.
నీ మధుర స్మృతులను తలస్తూ...
నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ,
శోకతప్త హృదయాలతో...

**శ్రీమతి నందిగాం సరోజిని గారు**
(భర్త: కీ॥శే॥ నందిగాం రాజేశ్వరరావు పట్నాయిక్ గారు)
జననం: 01-01-1934 మరణం: 17-07-2025

ఇట్లు
**కుమారులు-కోడళ్ళు:**
నందిగాం భూషణరావు-గీత
నందిగాం వెంకటరమణమూర్తి-కృష్ణవేణి
నందిగాం శివప్రసాద్-ఈశ్వరి
**కుమార్తెలు-అల్లుళ్ళు:**
ఎన్.ఇందిర-ఎల్.వి.కె.నందికేశ్వరరావు
డి.లక్ష్మి-డి.రామకృష్ణ పట్నాయిక్
ఎన్.సునీత-ఆర్.హరగోవిందరావు
మరియు మనుమలు-మనుమరాండ్రు, మునిమనుమలు-మునిమనుమరాండ్రు

పెద్దకర్మ: తే 27-07-2025 ది ఆదివారం నాడు ఇప్పిలి ప్రసాద శర్మ, గ్రామ పురోహితులు, కోరాడవీధి, శ్రీకూర్మంలో జరుపబడును.


STREE NIDHI
Credit Co - Operative Federation
Government of Andhra Pradesh

- స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు తీవ్ర పోటీ
- ప్రజాప్రతినిధులు, నేతలను ఆశ్రయిస్తున్న అభ్యర్థులు
- సర్వీస్ సర్టిఫికెట్లకు పెరిగిన గిరాకీ
- వాటి కోసం సొసైటీలు, రూరల్ బ్యాంకులపై ఒత్తిడి

సెర్ప్ పరిధిలో స్త్రీనిధి సహాయ మేనేజర్ పోస్టులకు అభ్యర్థులు వేలంవెర్రిగా పోటీపడుతున్నారు. మెరిట్, సర్వీస్ ఆధారంగా తీసుకునే ఈ ఉద్యోగాల కోసం రాజకీయంగా అప్పుడే ప్రయత్నాలు జోరందుకున్నాయి. సర్వీస్ సర్టిఫికెట్లు కీలకం కావడంతో వాటిని సంపాదించడంతోపాటు ప్రజాప్రతినిధుల ద్వారా పోస్టులు దక్కించుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

## సర్వీస్‌కే ప్రాధాన్యం..

# ఆ పత్రాలకు పైరవీల పర్వం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏపీ స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్య పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా 170 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. కంప్యూటర్ పరిజ్ఞానంతో డిగ్రీ అర్హత, తెలుగు బాషలో ప్రావీణ్యం తప్పనిసరిగా పేర్కొన్నారు. మైక్రో ఫైనాన్స్, రూరల్ డెవలప్‌మెంట్ రంగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేలకు పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందినట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా పరిధిలో స్త్రీనిధి మేనేజర్లుగా ముగ్గురు పని చేస్తున్నారు. వీరికి అదనంగా నియోజక వర్గానికి ఒకరు చొప్పున ఉమ్మడి జిల్లాలో పదిమంది అసిస్టెంట్ మేనేజర్లను నియమించనున్నట్లు సమాచారం. సాంకేతికంగా ఏడాది కాలానికి ఈ పోస్టులను భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నా భవిష్యత్తులో అంచెలంచెలుగా కొనసాగించడంతోపాటు హోదా పెరుగుతుందని భావిస్తుండటంతో ఈ పోస్టులకు నియోజకవర్గస్థాయిలో తీవ్ర పోటీ ఏర్పడింది. వీటిని తమవారికి ఇప్పించుకునేందుకు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. పలువురు మంత్రుల పేషీల నుంచి కూడా పైరవీలు మొదలైనట్లు తెలిసింది.

### సర్టిఫికెట్లకు గిరాకీ

అభ్యర్థుల అకడమిక్ అర్హతలతో పాటు సీనియారిటీ వెయిటేజ్, మైక్రోఫైనాన్స్, రూరల్ డెవలప్‌మెంట్ రంగాల్లో అనుభవానికి 60 మార్కులు, సొసైటీలు, రూరల్ బ్యాంకింగ్ సెక్టార్‌లో అనుభవం ఉన్నవారికి గరిష్టంగా 15 మార్కులు ఇవ్వనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీన్నే సద్వినియోగం చేసుకోవడానికి అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. సొసైటీలు, బ్యాంకింగ్‌లో పనిచేసిన అనుభవం లేకపోయినా.. ఉన్నట్లుగా సర్టిఫికెట్లు సంపాదించడానికి అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. దరఖాస్తు సమయంలోనే అర్హతలు, అనుభవం తదితర పత్రాలన్నీ అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నా.. దరఖాస్తు సమయంలో ఏదో ఒక అనుభవ పత్రాన్ని అప్‌లోడ్ చేసేసిన చాలామంది అభ్యర్థులు.. ఇంటర్వ్యూ నాటికి అసలు పత్రాలను సృష్టించి సమర్పించాలని భావిస్తున్నారు. వీటి కోసం సొసైటీలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే నాయకులను ఆశ్రయిస్తున్నారు.

### బ్యాంకు అధికారులపై ఒత్తిడి

తమవారికి పోస్టింగ్ ఇప్పించుకునే క్రమంలో అభ్యర్థులకు సర్వీస్ సర్టిఫికెట్లు - మిగతా లోపలి పేజీలో





• ఎడిటోరియల్

# రాష్ట్రపతి రబ్బర్‌స్టాంప్ కాకూడదు!

ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ హఠాత్తుగా రాజీనామా చేయడం.. అందుకు దారితీసిన పరిణామాలుగా పేర్కొంటూ విస్తృతంగా ప్రచారంలోకి వచ్చిన వివాదాస్పద అంశాలు అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థల పనితీరుపై చర్చకు ఆస్కారమిచ్చాయి. ఉప రాష్ట్రపతి, గవర్నర్ వ్యవస్థలపై ఇంత వరకు నడిచిన చర్చ.. అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన రాష్ట్రపతి వ్యవస్థపైకి మళ్లింది. దీనికి మరో సందర్భం కూడా కలిసివచ్చింది. స్వతంత్ర భారతదేశానికి ఇంతవరకు 15 మంది రాష్ట్రపతులుగా వ్యవహరించారు. వారిలో ఏకంగా పదిమంది సంవత్సరాలు వేరైనా ఒకే నెల, తేదీన.. అంటే జూలై 25న పదవులు చేపట్టడం ఒక అరుదైన విశేషం. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి స్వాతంత్ర్యానంతరం బాబూ రాజేంద్రప్రసాద్ మొట్టమొదటిసారి రాష్ట్రపతి పదవి చేపట్టారు. ఆయన తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్.. ఆ తర్వాత వరసగా జాకీర్ హుస్సేన్, వరహాగిరి వెంకట(వి.వి.)గిరి, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, నీలం సంజీవరెడ్డి, జ్ఞానీ జైల్‌సింగ్, ఆర్.వెంకట్రామన్, శంకరదయాళ్‌శర్మ, కె.ఆర్.నారాయణన్, అబ్దుల్ కలాం, ప్రతిభా పాటిల్, ప్రణబ్‌ముఖర్జీ, రామనాథ్ కోవింద్ రాష్ట్రపతులుగా పనిచేయగా.. ఆ క్రమంలో ప్రస్తుతం ద్రౌపది ముర్ము ఆ పదవిలో ఉన్నారు. కాగా మధ్యలో బీడీ జెట్టీ, మహమ్మద్ హిదయతుల్లా ఉప రాష్ట్రపతులుగా కొనసాగుతూనే.. రాష్ట్రపతి పదవిని కొన్నాళ్లు తాత్కాలికంగా నిర్వహించారు. వీరిలో ఇద్దరు (ప్రతిభా పాటిల్, ద్రౌపది ముర్ము) మాత్రమే మహిళా రాష్ట్రపతులు. కాగా రాష్ట్రపతి పదవి అనేది దేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవి. అందుకే రాష్ట్రపతిని దేశ ప్రథమ పౌరుడిగా గౌరవిస్తాం. అలాగే అది కేవలం పదవి కాదు.. ఒక సమున్నత వ్యవస్థ. అందుకే రాష్ట్రపతి భవన్‌ను రాజ్యాంగ సౌధంగా అభివర్ణిస్తుంటారు. ఇందుకు తగినట్లే రాష్ట్రపతికి విశేష అధికారులు ఉంటాయి. రాజ్యాంగపరంగా దేశ పరిపాలన సాగేంచేది రాష్ట్రపతే. ప్రధాన మంత్రి, ఆయన మంత్రిమండలితో కూడిన జాతీయ(కేంద్రం) ప్రభుత్వం దేశపాలన లో రాష్ట్రపతికి సలహాలిస్తూ, సహకరించే వ్యవస్థగానే రాజ్యాంగంలో పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్, పార్లమెంటు తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర పడాల్సిందే. అప్పుడే అవి చట్టరూపం దాలుస్తాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం చేసే బిల్లులు, తీసుకునే నిర్ణయాలు దేశానికి, ప్రజలకు నష్టదాయకంగా ఉన్నాయని భావిస్తే.. వాటినే తిరస్కరించే, అవసరమైతే కేంద్ర ప్రభుత్వాన్ని రద్దుచేసే విచక్షణాధికారాలను సైతం మన రాజ్యాంగం రాష్ట్రపతికి దఖలుపర్చింది. కానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో వాటిని ఏ రాష్ట్రపతి కూడా వినియోగించలేదనే చెప్పాలి. ఆ విచక్షణాధికారాలను వినియోగించే పరిస్థితి రాలేదేమో కదా! అనే అభిప్రాయం కలగవచ్చు. కానీ స్వాతంత్ర్య భారత చరిత్రలో అటువంటి క్లిష్ట పరిస్థితులు కొన్ని వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ అప్పుడు కూడా రాష్ట్రపతులుగా ఉన్నవారు తగిన రీతిలో స్పందించలేదన్న అపవాదు ఉంది. ఒక్క జైల్‌సింగ్ మాత్రమే ఒక సందర్భంలో తన విచక్షణాధికారాలను ప్రయోగించారు. ఆయన తప్ప మిగతావారు ప్రభుత్వం, ప్రధానులతో విభేదించిన సందర్భాలు లేవు. ప్రధాని, ఆయన కేబినెట్ తీసుకున్న నిర్ణయాలకు మౌనంగా ఆమోదముద్ర వేయడం తప్ప ఏ రాష్ట్రపతీ తనదైన ముద్ర వేయలేదు. ఇదే రాష్ట్రపతి అంటే కేవలం సంతకం చేసి రబ్బర్ స్టాంప్ వేసే వ్యవస్థ, కేవలం హోదా అనుభవంచే పదవి అన్న అభిప్రాయం స్థిరపడిపోయిందనడం అతిశయోక్తి కాదు. ఈ నిష్క్రియాపరత్వమే, కేంద్రాన్ని అడ్డుచెప్పలేని బలహీనతే అనేక ప్రభుత్వాల హయాంలో లెక్కలేనన్ని అవినీతి కార్యకలాపాలు, కుంభకోణాలు జరిగి దేశ ప్రతిష్టకు, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేకూర్చాయి. అయితే రాష్ట్రపతులందరూ నిజాయితీగానే పనిచేశారు. ప్రభుత్వాన్ని నియంత్రించే బాధ్యతను మాత్రం నిర్వర్తించలేకపోయారు. అయితే ఇందిర కుటుంబానికి విధేయుడిగా పేరొందిన జైల్‌సింగ్ మాత్రం రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోస్టల్ బిల్లును తిప్పి పంపి ఆ రోజుల్లో పెద్ద సంచలనమే సృష్టించారు. అలా ఇంకెవరూ చేయలేకపోయారు. ఎమర్జెన్సీకి ముందు, ఎమర్జెన్సీ సమయంలో దేశం తీవ్ర విపత్కర పరిస్థితుల్లో ఉన్నా అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ రాష్ట్రపతిగా తన విశేషాధికారాలను విస్మరించి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలను మౌనంగా ఆమోదించి విమర్శల పాలయ్యారు. ఇప్పటికీ అదే అవ్యవస్థ కొనసాగుతుండటం దురదృష్టకరం.

## డీఎస్పీ శాంతారావు మృతి పట్ల కృష్ణదాస్ సంతాపం

(సత్యంన్యూస్, నరసన్నపేట)



యాదాద్రి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా పాలాకి మండలం డోల గ్రామానికి చెందిన డీఎస్పీ జల్లు శాంతారావు మృతి చెందడంపై మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శాంతారావు తమ జిల్లా గర్వంగా నిలిచిన యువ అధికారి అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న పోలీసు అధికారి అని, తమ గ్రామం నుంచి విశేషంగా ఎదిగిన వ్యక్తి ఇలా అర్థాంతరంగా మృతి చెందడం తట్టుకోలేని విషాదమన్నారు.

## గారలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మండలంలోని గార, శాలిహుండం పంచాయతీల్లో శనివారం బాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించినట్లు వైకాపా నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో తెలియజేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఇప్పుడు వచ్చే పాలకులకు హామీలపై నిలదీయాలని కోరారు. గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు ఏ విధంగా అందించారో తెలిపారు. భవిష్యత్తులో మోసం చేసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో గార మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 'సత్యం' కథనానికి స్పందన

(సత్యంన్యూస్, కొత్తూరు)

'మండలంలో ఎరువు కోసం ఎదురుచూపులు' అనే శీర్షికతో సంచలన సాయంకాల పత్రిక 'సత్యం' మంగళవారం ఒక కథనం వెలువరించిన సంగతి తెలిసిందే. ఆ కథనానికి స్పందిస్తూ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వర్ణలత 6 రైతుభరోసా కేంద్రల పరిధిలో 120 యూనిట్ల యూరియాని రైతుల కోసం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. కొత్తూరు, కర్లెమ్మ, తదితర రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదే విధంగా మండలంలోని గుణభద్ర గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఎరువుల పంపిణీని తహసీల్దార్ కె.బాలకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.వైకుంఠరావు, వై.తిరుపతి, వి.ఎ.వసంత, రైతులు పాల్గొన్నారు.



## సైనికులను గౌరవిస్తే దేశమాను గౌరవించినట్లే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ వారు ఏర్పాటు చేసిన కార్గిల్ దివాస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ మన సైనికులకు గౌరవం ఇవ్వడం అంటే దేశమాతను గౌరవించినట్లేనన్నారు. వారి త్యాగాల్ని గుర్తించి, స్మరించుకోవడం మన కర్తవ్యం. దేశం కోసం జెండా ఊపినవారిని మరవకుండా, మన హృదయాల్లో నిలిపే యత్నమే నిజమైన దేశభక్తి అన్నారు. దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన కార్గిల్‌వీరుల త్యాగాలను గుర్తుంచుకోవడం మన సమాజ బాధ్యత అన్నారు. వీరి వీరగాథలు భావితరాలకు ప్రేరణనిచ్చేలా చైతన్యం కల్పించాలని స్పష్టం చేశారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను ఘనంగా సన్మానించి, వారి సేవలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికులు, నేషనల్ కేడెట్ కార్ప్స్ సభ్యులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### పెంచిన విద్యుత్ సర్దుబాటు

## తక్షణమే చార్జీలను తగ్గించాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రజల పైన ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల పైన భారం మోపిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలపై విద్యుత్ బారాలను మోపడం సరికాదన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను బిగించినప్పుడు కూటమి ప్రభుత్వ నాయకులు స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయమని చెప్పిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయో ప్రజలకు చెప్పాలన్నారు. ఆదానీతో ఏర్పాటు చేసుకున్న సేకి ఒప్పందాన్ని రద్దు చేయమని డిమాండ్ చేసిన టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాటగా ప్రభుత్వం కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసగించవద్దన్నారు. రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ కరెంట్ చార్జీల భారాన్ని పేద ప్రజలపై వేయడం తగదని, స్మార్ట్‌మీటర్ల పేరిట సాగుతున్న దోపిడీని అరికట్టాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఆదానితో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసి ముఖ్యమంత్రి పారదర్శకత్వం నిరూపించుకోవాలన్నారు. అదేవిధంగా ఒకప్రక్క పేద ప్రజలు పొట్టకూటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కరెంట్ చార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఇప్పటికే నాలుగుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపిందన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌ను రద్దుచేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వచ్చేనెల 5న మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొర్ను లచ్చయ్య, లవకుమార్, భాస్కరరావు, కర్ణవీరుడు, అప్పారావు, తిరుపతి, ఏఐవైఎఫ్ నాయకులు వసంతరావు, కిషోర్, ప్రభాకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు



# విశ్వంభర.. ఏదో పెద్దగా రావాలి!!


ప్రస్తుతం చిరంజీవి చేస్తున్న రెండు సినిమాలు ప్రొడక్షన్‌లో ఉన్నాయి. ఇందులో విశ్వంభర షూటింగ్ నేటితో పూర్తయింది. చిరు-మౌనీరాయ్‌పై తీసిన స్పెషల్ డ్యాన్స్ నెంబర్‌తో గుమ్మడికాయ్ కొట్టారు. అనిల్ రావిపూడితో చేస్తున్న సినిమా మూడు షెడ్యూళ్లు పూర్తి చేసుకుంది. అయితే ఈ రెండు సినిమాల బజ్ పోల్చుకుంటే అనిల్-చిరు కాంబో మీదే ఎక్కువ హైప్ ఉంది. ఇంకా టీజర్ కూడా రాకుండానే ఆ సినిమాకి అంత క్రేజ్ రావడానికి కారణం డైరెక్టర్ అనిల్ రావిపూడి ఫ్యాక్టర్. అపజయం లేని ఆయన చాలా పక్కాగా తీసుకుంటూ వెళ్తున్నారు. విశ్వంభర పరిస్థితి మాత్రం వింతగా మారింది. ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్ సినిమా బజ్‌పై చాలా ప్రభావం చూపింది. గ్రాఫిక్స్ అన్నీ తేలిపోయాయి. దీంతో టోటల్ సినిమా మీదే ఎఫెక్ట్ పడింది. గ్రాఫిక్స్ స్కోప్ ఉన్న కథలో అవి పక్కాగా కుదరాల్సిందే. యావరేజ్‌గా ఉన్న జనం ఆసక్తి చూపించడం లేదు. టీజర్‌కి వచ్చిన రెస్పాన్స్ చూసి టీం చాలా బలంగా గ్రాఫిక్స్‌ని డిజైన్ చేస్తున్నామని చెప్పుకొచ్చింది. అయితే కేవలం మాటలు సరిపోవు. విశ్వంభరపై మళ్లీ బజ్ రావాలంటే.. ఏదో బలమైన కంటెంట్ సినిమా నుంచి వదలాలి. అది ట్రేడ్, జనాలకు నచ్చాలి. గ్రాఫిక్స్‌పై ఉన్న అనుమానాలు తొలగాలి. అప్పుడే ఆటోమేటిక్‌గా బజ్ వస్తుంది. ఇప్పుడు టీం కూడా అదే ప్లాన్‌లో ఉందని తెలుస్తుంది. సినిమా నుంచే వచ్చే తర్వాత కంటెంట్‌పై చాలా కేర్ తీసుకుంటున్నారు. ఈసారి విశ్వంభర నుంచి వచ్చే కంటెంట్ ఖచ్చితంగా అంచనాలు పెంచేదిగా ఉంటుందని తెలుస్తోంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..




## స్లో గా సర్ప్రైజ్ చేస్తున్న మహావతారా నరసింహ

పవన్ కళ్యాణ్ సినిమాకు పోటీగా ఓ యానిమేటెడ్ ఫిల్మ్ మార్కెట్ లో ఎంట్రీ ఇస్తుందని ఎవరు ఊహించి ఉండరు. ఈ మధ్య కాలంలో యానిమేషన్ సినిమాలకు బాగానే రెస్పాన్స్ ఉంది కానీ. ఓ పాన్ ఇండియా గ్రాండియర్ తో పాటు ఇలాంటి సినిమాను దింపడం అనేది సాహసమనే చెప్పాలి. నిన్న విడుదలైన మహావతార నరసింహకు స్లో స్లో గా పోసిటివ్ టాక్ బయటకు వస్తుంది. వాస్తవానికి సినిమాకు మరీ అంతా బజ్ లేదు. కెజిఎఫ్ , సాలార్ నిర్మాతలు భారీ బడ్జెట్ కేటాయించి ఈ సినిమాను తెరమీదకు తీసుకుని వచ్చారు. హై క్వాలిటీ విజువల్స్ తో ఆడియన్స్ కు థ్రిల్లింగ్ ఎక్స్పీరియెన్స్ కలిగించేలా రూపొందించారు. పైగా డివోషనల్ కంటెంట్ కావడంతో ప్రేక్షకులలో ఇంకాస్త ఆసక్తి పెరుగుతుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సాలిడ్ రెస్పాన్స్ లభిస్తుంది. ఈ సినిమా కథ తెలియనిది కాదు. ఇప్పటివరకు చాలా సినిమాల్లో ఈ కథను చూసాము కూడా. భక్త ప్రహల్లాదుడి మొర విని.. బయటకు వచ్చిన నరసింహ అవతారం రాక్షస రాజు.. హిరణ్య కశిపుడిని అంతం చేసే కథ ఇది. పూర్తి కథ మాత్రం 1967 లో వచ్చిన భక్త ప్రహ్లాద సినిమాలోనే చూసి ఉంటారు. ఆ తర్వాత మరోసారి ఈ సినిమా చేసే ప్రయత్నం ఎవరు చేయలేదు. అలాంటి క్లాసిక్స్ ను రీక్రియేట్ చేయాలంటే కచ్చితంగా ప్రేక్షకులను స్క్రీన్ ప్లే తో మెస్మరైజ్ చేయాల్సి ఉంటుంది. ఇక ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత ఈ సినిమాను యానిమేషన్ రూపంలో తీసుకుని వచ్చారు. ఇందులో విజువల్స్ తో పాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కు కూడా స్పెషల్ గా అట్రాక్ట్ చేస్తుంది. సామ్ సిఎస్ ఈ సినిమాకు సంగీతం సమకూర్చారు. లైవ్ యాక్టర్స్ లేకపోయినా బ్యాక్గ్రౌండ్ యానిమేషన్ తోనే అవి నిజమైన పాత్రలుగా రూపొందించి టీం సక్సెస్ అయ్యారు. ముఖ్యంగా మొదటి అరగంట.. అలాగే క్లైమాక్స్ ఈ రెండిటికి ప్రేక్షకులు ఫిదా అయిపోతారు. సో ఈ సినిమా ఇలానే టాక్‌తోనే కంటిన్యూ అయితే మంచి హిట్ అందుకునే అవకాశం లేకపోలేదు. ఇక ఏమౌతుందో చూడాలి. - ఐడ్రీమ్‌పోస్ట్.కామ్ సౌజన్యంతో..



అధిక బరువు తగ్గడం కోసం నటీమణులు పడే కష్టం అంతా ఇంతా కాదు. నిరంతరం జిమ్ముల్లో కసరత్తులు చేస్తున్నారు. తిండి కట్టేసి చాలా నియమనిష్ఠలతో ప్రయత్నిస్తున్నారు. ఒజెంపిక్ తీసుకుని బరువు తగ్గారని విమర్శల్ని ఎదుర్కొన్న కరణ్ జోహార్- బోనీకపూర్‌ల జాబితాలో వీళ్లు లేరు. ఇప్పుడు ప్రముఖ హిందీ నటి విద్యాబాలన్ తన అధిక బరువు సమస్య గురించి, బరువు హెచ్చు తగ్గుల కారణంగా తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి మాట్లాడారు.

తాను ప్రతిసారీ బరువు తగ్గినా తిరిగి కొంతకాలానికి యథాతథ స్థితికి పెరగడంపై కలత చెందేదానిని అని విద్యాబాలన్ పేర్కొన్నారు. అయితే పెరిగిన బరువుతోనే నటిగా తన ప్రయత్నాలు తాను కొనసాగించానని, లీడ్ పాత్రల్లో కొనసాగానని విద్యా చెప్పారు. నేను సిగ్గు లేని ఆశావాదిని... నాకు చాలా ఆత్మవిశ్వాసం ఉంది. నేను వెనుకబడిపోకుండా నా గొప్పతనాన్ని నేను ప్రదర్శించాను! అని బాలన్ తెలిపారు. చుట్టూ ఉన్న జనాలు బరువు తగ్గాలని సూచించినా కానీ, నాలో ఏ తప్పు లేదని భావించానని విద్యా అన్నారు. నేను ఎప్పుడూ లీడ్ పాత్రలను వదిలిపెట్టలేదు.. నాలో అభద్రతా భావం లేనే లేదు! అని తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేసారు విద్యా బాలన్. జీవితాంతం సన్నగా ఉండటానికి ప్రయత్నించాను. కఠినమైన ఆహార, వ్యాయామ నియమాలు అనుసరించాను.. కొన్నిసార్లు బరువు తగ్గినా తిరిగి యథాస్థితికి వచ్చేదానిని అని తెలిపారు. ఆకు కూరలు, కూరగాయలు తిన్నాను. జీవితాంతం శాఖాహారిని. అయితే అన్ని కూరగాయలు అందరికీ సూట్ కావు. కొన్నిటిని ఎంపిక చేసుకుని తినాలని కూడా బాలన్ వెల్లడించారు. ఎన్టీఆర్ బయోపిక్ లో బసవతారకం పాత్రలో విద్యాబాలన్ నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో ఎన్నో క్లాసిక్ హిట్ చిత్రాల్లో నటించిన బాలన్, తెలుగమ్మాయి, పాపులర్ నటి సిల్కుస్మిత పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ది డర్టీ పిక్చర్ పేరుతో విడుదలైన ఈ చిత్రం 100 కోట్లు వసూలు చేసింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



## నేను సిగ్గు లేని ఆశావాదిని!




## ఇప్పటికైనా హామీలు అమలుచేయాలి



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలను చంద్రబాబు మోసగించారని, సూపర్ సిక్స్ పథకాలు అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పటికైనా వాటిని అమలుచేసి తీరాలని పోలాకి మండలం సంతలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి, వైకాపా నరసన్నపేట నియోజకవర్గ ఉద్యోగ, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు వై.వి.రమణ అన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రుత్యాలను ఇంటింటికి వివరించారు. కార్యక్రమంలో పోలాకి మండల ఎంపీపీ ముద్దాడ దమయంతి భైరాగి నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, వైకాపా వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ పెద్దలు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# పలకే కదాని.. పరాచకాలాడొద్దు..!

## - థియేటర్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న కాలువలు -

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

సమాజంలో అన్నీ ప్రభుత్వమే చేయాలంటే కుదిరే పనికాదు. అసలే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు నిధులు లేవని ప్రభుత్వం గగ్గోలు పెడుతుంటే, కనీస సామాజిక బాధ్యతను కూడా మర్చిపోయి కొన్ని సంస్థలు తమ కళ్లముందే సమస్య ఉన్నా, సినిమా చూసినట్లు చూస్తున్నాయి. స్థానిక రామలక్ష్మణ థియేటర్, సరస్వతి మహల్ ముందున్న ప్రధాన కాలువల్లో పూడికలు తీయడానికి కాలువ మీద ఉన్న పలకలు కొద్ది రోజుల క్రితం మున్సిపల్ యంత్రాంగం తొలగించింది. తొలగింపు పూర్తయినా దీని మీద పలకలు మాత్రం ఇంకా ఏర్పాటు చేయలేదు. రామలక్ష్మణ థియేటర్ గేటు ఎదురుగా ఉన్న కాలువ మీద పలకలు ఉంటేనే థియేటర్ లోపలికి వాహనాలు వెళ్తాయి. అంటే.. ఈ పలకలు కేవలం థియేటర్‌కు మాత్రమే ఉపయోగకరం. ఇంతవరకు పలకలు లేకపోయినా పట్టించుకోపోతే ఒక లెక్క. కానీ ఇప్పుడు ఈ రెండు థియేటర్లలో పవన్‌కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లు నడుస్తుంది. మరోవైపు ఇంజినీరింగ్‌లో చేరడానికి ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు సెలవులు ఉన్నాయి.



కాబట్టి థియేటర్లకు పెద్ద సంఖ్యలో జనం వస్తారన్న అంచనాలు ఉన్నాయి. కనీసం ఇటువంటి సమయంలోనైనా నాలుగు పలకలు తెచ్చి థియేటర్ యాజమాన్యం కాలువ మీద వేయాలని ఆలోచించకపోవడం విడ్డూరం. సినిమా విడిచిపెట్టినప్పుడు జనమంతా ఒకేసారి పోలోమని బయటకు వస్తారు. ఈ సమయంలో కార్లు, ద్విచక్ర వాహనాలు కూడా ఈ కాలువ మీద నుంచే రావాలి. కొంచెం బ్యాలెన్స్ తప్పినా కాలువలోకే వాహనాలు దిగిపోతాయి. మున్సిపాలిటీ తొలగించింది కదా.. మున్సిపాలిటీయే వేస్తుందన్న ధీమాతో మేనేజ్‌మెంట్ ఉన్నట్టుంది. వాస్తవానికి ఈ కాలువ మీద పలకలు గతంలో ఏర్పాటు చేసుకున్నది దీనికి ఆనుకొని ఉన్న షాపు యాజమాన్యాలే. కాబట్టి ఇప్పుడు కూడా వారే మళ్లీ పలకలు పెట్టుకోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు.

## తిరుమల నిత్యాన్నదానానికి కూరగాయల రథం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

తిరుమల నిత్యాన్నదాన కార్యక్రమానికి విజయవాడ నుంచి ఏర్పాటు చేసిన కూరగాయల రథాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2006 నుంచి ఈ కార్యక్రమం జరగటం సంతోషంగా ఉందని, గత ఏడాది ఇదే కూరగాయల రథాన్ని తాను ప్రారంభించడం మహానందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం, ఎంతోమంది ఆకలి తీర్చేందుకు ఉపయోగపడటం బృహత్తరమైన కార్యక్రమమని కొనియాడారు. ఆపదలో ఉన్నవారికి సాయమందించేలా అందరికీ ఆ వేంకటేశ్వర స్వామి శక్తిని ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

# బీల థర్మల్ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

### - హైకోర్టులో రిట్ దాఖలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపట్టినవారిపైనే దాడి జరపడంతో పాటు ముగ్గురి మృతికి కారణమైన నాటి ప్రభుత్వం తిరిగి ఉద్యమకారులపై కేసులు బనాయించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2010 జూలై 14న నాటి ప్రభుత్వం కాల్పులు జరిపి, ముగ్గురు మృతికి, పలువురు గాయాలపాలవడానికి కారణమైందని, తిరిగి ఉద్యమకారులపైనే కేసులు బనాయించి 14 ఏళ్లుగా వారిని కోర్టుల చుట్టూ తిప్పుతోందని వారు పేర్కొన్నారు. కేసులో ప్రథమ ముద్దాయి బీన ఢిల్లీరావు మిగతా 23మంది ముద్దాయిలతో కలసి ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి,



హైకోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ద్వారా ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమా మహేశ్వరరావు సహకారంతో హైకోర్టులో న్యాయవాది కరుకోల సింహాచలం రిట్ పిటిషన్ వేశారు. ఈ రిట్ పిటిషన్లో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డిజిపి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మిగిలిన ఏడుగురు పోలీసు అధికారులకు నోటీసులు జారీ అయ్యాయని ప్రథమ ముద్దాయి ఢిల్లీరావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణ రావు, న్యాయవాది కరుకోల సింహాచలం శనివారం విలేకరులకు వివరించారు. ఈ కేసుల వల్ల చాలామంది యువకులు వీసాలు, పాస్ పోర్టులు రాక ఉపాధి కోసం విదేశాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గతంలో ఎన్నికల ముందు అన్ని పార్టీల నాయకులు కేసులు ఎత్తివేస్తామని హామీలు ఇచ్చి అనంతరం మర్చిపోయేవారని తెలిపారు. చివరికి హైకోర్టును నమ్ముకుని రిట్ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఈ విషయంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 40 మందికి వైద్యపరీక్షలు



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

డాక్టర్ మోహనరావు క్లినిక్ సహకారంతో జెమ్స్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఏర్పాటుచేసే ఉచిత వైద్యశిబిరంలో భాగంగా ఈ వారం ఉదయం 10 నుంచి 12 గంటల మధ్య నిర్వహించిన శిబిరంలో 40 మంది వైద్య తనిఖీలు చేయించుకున్నారు. స్త్రీలకు ఉచితంగా డాక్టర్ వై.భవ్యశ్రీ పరీక్షలు నిర్వహించినట్లు జెమ్స్ మదర్ అండ్ చైల్డ్ మేనేజర్ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వెంకు మహంతి లక్ష్మణరావు తెలిపారు.

# ఎస్ఎస్ జ్యూయలరీ మార్ట్ ప్రారంభం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగర పరిధి జిటి రోడ్‌లో ఎస్ఎస్ జ్యూయలరీ మార్ట్ శనివారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా సినీ నటి ఈషాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అలంకార శోభ కనిపిస్తుందని, అతివలకు కావల్సిన ఆభరణాలు, నగర నడిబొడ్డున లభించటం మంచి తరుణమన్నారు. ఎస్ఎస్ జ్యూయలరీ మార్ట్ యాజమాన్య సభ్యులు కిల్లంశెట్టి వెంకట సత్యనారాయణ, శ్రీను, సురేష్, సింహాద్రి సీతారాం, పొట్నూరు మోహన్, పొట్నూరు వెంకట నవీన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నటి ఈషాతో కలసి ఆభరణాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, మెండ దాసునాయుడు, అంపోలు మూర్తి, అంధవరపు సూరిబాబు, ఊణ్ణ నాగరాజు, సుంకరి కృష్ణ, పాండ్రంకి శంకర్, గురుగుబెల్లి లోకనాధం, పైడిశెట్టి జయంతి, పైడిశెట్టి బెనర్జీ, అంధవరపు సంతోష్, పైడి రాజారావు, శాసనపురి శ్రీను, మైలపల్లి నర్సింహమూర్తి, మూకళ్ల తాతబాబు, మూకళ్ల సుగుణ, ఎస్ఎస్ జ్యూయలరీ మార్ట్ యాజమాన్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



## సర్వీస్‌కే ప్రాధాన్యం.. ఆ పత్రాలకు పైరవీల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలంటూ గ్రామీణ బ్యాంకుల అధికారులపై పడుతున్నారు. డీసీసీబీ, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, పీఏసీఎస్, ఆప్కాబ్ తదితర సంస్థల్లో అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, క్లర్క్ వంటి పోస్టుల్లో పని చేసినట్లు తమవారికి సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ ఆయా బ్యాంకుల సీఈవోలపై ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఎమ్మెల్యేలే నేరుగా సొసైటీ సీఈవోలకు ఫోన్ చేసి అక్కడ పని చేసినట్టు అనుభవపత్రం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. పనిచేయవారికి అనుభవ పత్రం ఇవ్వలేమని సీఈవోలు మొత్తుకుంటున్నా వినిపించుకోవడంలేదని సమాచారం. దాంతో ఈ వ్యవహారం సొసైటీల సీఈవోలకు తలనొప్పిగా మారింది.

మహిళల అభ్యున్నతి కోసం స్త్రీ నిధి సంస్థను 2011లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారాలు చేపట్టడానికి, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించడానికి ఈ సంస్థ రుణాలు మంజూరు చేస్తుంది. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి, జీవన ప్రమాణాల మెరుగుకు సహాయపడాలన్నది దీని లక్ష్యం. వైకాపా హయాంలో స్త్రీ నిధి ద్వారా గ్రామ, పట్టణ ప్రాంత మహిళల ఆర్థిక స్వావలంబన కోసం చేయూత పథకాన్ని తీసుకొచ్చారు. ఆ పథకం కింద స్వయం సహాయ సంఘాల సభ్యులకు 3 నుంచి 5 శాతం వడ్డీకి రుణాలు ఇచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీన్ని మరింత విస్తరించాలని నిర్ణయించింది. కేజీ నుంచి పీజీ వరకు చదువుకోవడానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పం కింద రుణాలను ఇవ్వడానికి స్త్రీ నిధి ద్వారా అర్హులను గుర్తిస్తారు. ఈ రుణాలను డ్వాక్రా మహిళలు తమ పిల్లల చదువుకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. తీసుకున్న రుణాన్ని మూడేళ్ల కాలపరిమితిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని అసిస్టెంట్ మేనేజర్లు పర్యవేక్షిస్తారు. అర్హుల గుర్తింపు, రుణాల మంజూరు, రికవరీ తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అందుకే నియోజకవర్గ స్థాయిలో కీలకమైన ఈ పోస్టుల్లో తమవారిని కూర్చోబెట్టేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ పెద్దలు మాత్రం పైరవీలకు అవకాశం ఇవ్వొద్దని స్త్రీ నిధి అధికారులకు ఆదేశించినట్టు తెలిసింది. 1:3 నిష్పత్తిలో షార్ట్ లిస్టు తయారు చేసి ఇంటర్వ్యూలకు పిలవాలని ఆదేశించినట్టు సమాచారం.

# తెలంగాణలో ప్రమాదంలో సిక్కోలు డీఎస్పీ మృతి




**సత్యంన్యూస్, శ్రీకాకుళం**

విజయవాడ దాటాక సూర్యాపేట మీదుగా హైదరాబాద్ వెళ్తున్న తోవలో వచ్చే చౌటుప్పల్ వద్ద శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం డోల గ్రామానికి చెందిన జల్లు శాంతారావు (54) అక్కడికక్కడే మృతిచెందారు. ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లో పని చేస్తున్న శాంతారావుతో పాటు మరో డీఎస్పీ చక్రధరరావు (57) మృతిచెందగా, ఏఎస్పీ కోకా రామ్‌ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..

పోలీసు అధికారులు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డులో పడటంతో అట్నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడం వల్ల అక్కడికక్కడే మృతిచెందారు. వాహనంలో ఉన్నవారంతా ఏపీకి చెందిన పోలీసు అధికారులే. జల్లు శాంతారావు డోలకు చెందిన పేద రైతు కుటుంబం నుంచి వచ్చారు. కష్టపడి డైరెక్ట్ ఎస్ఐగా సెలక్ట్ అయ్యారు. ఏపీఎస్పీకి చెందిన రిక్రూట్‌మెంట్‌లో ఈయన ఎస్ఐగా 1995లో చేరడంతో, అక్కడ్నుంచి ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లోనే ఆయన సర్వీసంతా పని చేశారు. రాజశేఖరరెడ్డి నుంచి కిరణ్‌కుమార్ రెడ్డి వరకు ముఖ్యమంత్రుల వద్ద ఆయన సెక్యూరిటీ వింగ్‌లో వివిధ హోదాల్లో సేవలందించారు. సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరొందిన శాంతారావు మరణించారన్న వార్త తెలిసి డోలలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఎందుకంటే.. శాంతారావు సోదరుడు, సోదరి డోలలోనే ఉన్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న శాంతారావు వీకెండ్‌లో ఇంటికి వెళ్తుంటారు. తన అన్న కూడా డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసి చనిపోవడంతో ఆయన కుమారుడు ఇప్పుడు పోలాకి రెవెన్యూలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. శాంతారావుకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కొడుక్కు కొద్ది నెలల క్రితమే వివాహం చేశారు. చిన్నకొడుకు ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎంఎస్ కోసం విదేశాలకు వెళ్లారు. శాంతారావు ఎస్ఐ అయిన తర్వాత తన కుటుంబంలో అందర్నీ చదివించి, ఉన్నత స్థాయిలో నిలపడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారని గ్రామస్తులు చెబుతున్నారు.


















-థాయ్‌ల్యాండ్-కంబోడియాల సరిహద్దు వివాదం

-దానికి కేంద్ర బిందువుగా అతిప్రాచీన శైవాలయం

-దశాబ్దాలుగా సాగుతున్న ఘర్షణలు, ఉద్రిక్తతలు

-బౌద్ధం విలసిల్లే ప్రాంతాల్లో హిందూ ఆనవాళ్లు ఉండటమే విశేషం.

# శివాలయ ప్రాంతం.. రెండు దేశాల పంతం!

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలో పలు దేశాల మధ్య ఘర్షణలు, యుద్ధాలు నిత్యకృత్యంగా మారాయి. మూడేళ్లకుపైగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధం రావణ కాష్ఠంలా కొనసాగుతూనే ఉంది. అదే కోవలో పాలస్తీనా, ఇజ్రాయెల్ తలపడుతున్నాయి. ఈ రెండు దేశాల సైనిక ఘర్షణలు లెబనాన్, సిరియా, ఇరాన్, యెమెన్ వంటి దేశాలకు విస్తరించాయి. ఇక దక్షిణాసియాలో రెండు నెలల క్రితం భారత్, పాక్‌ల మధ్య స్వల్పకాలిక యుద్ధం జరిగింది. మరోవైపు చైనా భారత్, ఇతర సమీప దేశాలను నిరంతరం యుద్ధోన్మాదంతో కవ్విస్తూ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోంది. ఇదే కోవలో ఆగ్నేయాసియాలోనూ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇరుగు పొరుగు దేశాలుగా ఉంటూ పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన థాయ్‌ల్యాండ్, కంబోడియా మధ్య సరిహద్దు సమస్య మళ్లీ రాజుకుంది. కొద్దిరోజులుగా రెండు దేశాలు పరస్పరం కాల్పులకు డ్రోన్లు, వైమానికి దాడులకు పాల్పడుతున్నాయి. తాజా ఘర్షణలకు రెండు దేశాల సరిహద్దుల్లో ఉన్న హిందూ ఆలయ సముదాయాలే పరోక్షంగా కారణం కావడం.. అందులోనూ ఒకటి అతి ప్రాచీనమైన శివాలయం ఉండటం విశేషం. సహజంగా భారతదేశంలో తప్ప మరెక్కడా హిందూమతం లేదని, హిందువులు ఉన్నా అతి తక్కువ సంఖ్యలో మైనారిటీలుగా ఉంటారని అనుకుంటాం. అది పాక్షిక వాస్తవం మాత్రమే. ప్రాచీన కాలం నుంచి దేశాంతరాల్లోనూ హిందూ మతం విలసిల్లిందని.. ఇప్పుడూ విలసిల్లుతోందని చెప్పడానికి ఇదో నిదర్శనం. అదలా ఉంటే.. థాయ్‌ల్యాండ్, కంబోడియా దేశాల మధ్య సరిహద్దు వివాదం కూడా ఇప్పటిది కాదు. దశాబ్దాల తరబడి కొనసాగుతూ సైనిక ఘర్షణలకు, ఉద్రిక్తతలకు



తావిస్తోంది. ఆరు దశాబ్దాల క్రితమే దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు చెప్పినా.. ఉద్రిక్తతల ఉపశమనానికి అది దోహదపడలేదు. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య మరోసారి యుద్ధం వాతావరణం నెలకొంది. ఏకంగా కంబోడియాపై ఎఫ్-16 ఫైటర్ జెట్లతో థాయ్‌ల్యాండ్ ఎయిర్ స్ట్రైక్స్ చేసే వరకు వెళ్లింది. అంతకు ముందు రెండు దేశాల మధ్య వివాదాస్పదంగా ఉన్న ప్రాంతంలో కంబోడియా ఏర్పాటు చేసిన ల్యాండ్ మైన్లు పేలి థాయ్‌ల్యాండ్ సైనికులు గాయపడ్డారు. ఈ ఘర్షణలు తీవ్రరూపం దాల్చి పరస్పర కాల్పులు, గ్రనేడ్, రాకెట్ లాంఛర్ల ప్రయోగాల వరకు వెళ్లాయి. ఈ ఘటనల్లో ఇరుపక్షాలకు చెందిన తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.

## దశాబ్దాల వివాదం

థాయ్‌ల్యాండ్, కంబోడియా దేశాలు 817 కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్నాయి. సరిహద్దుల నిర్ణయంలో కొన్ని ప్రాంతాల విషయంలో రెండు దేశాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల తరచుగా వివాదాలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. ఇందులో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన ఉన్నప్పుడే గుర్తించారు. అయితే సరిహద్దుల్లో ప్రముఖ ఆలయాలుగా ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అడవులతో కూడిన ప్రాంతాల కోసం ఇరు దేశాలు పరస్పరం పోరాడుతున్నాయి. వీటిలో డెంగ్రిక్ పర్వతంపై ఉన్న ప్రీక్ విహార్(శివాలయం) వివాదానికి కేంద్ర బిందువుగా ఉంది. డెంగ్రిక్ పర్వతం థాయ్‌ల్యాండ్‌కు అత్యంత సమీపంలో ఉంది. ఈ వివాదం హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) వరకు వెళ్లగా ఆ ఆలయం ఉన్న ప్రాంతం కంబోడియాకు చెందుతుందని 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఈ ఆలయం కంబోడియాకే చెందుతుందని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ.. సరిహద్దు రేఖలు నిర్ణయించుకునే విషయంలో రెండు దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఫలితంగా తరచుగా ఘర్షణలు చెలరేగుతూనే ఉన్నాయి. మొదట ఈ తీర్పును థాయ్‌ల్యాండ్ ఆమోదించినా స్థానిక సెంటిమెంట్లు, సంప్రదాయాల కారణంగా తరచూ వివాదాలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి. కంబోడియా విజ్ఞప్తి మేరకు ఈ ఆలయాన్ని 2008లో యూనెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. థాయ్‌ల్యాండ్ దీన్ని వ్యతిరేకించడమే కాకుండా గతంలో చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను కంబోడియా ఆక్రమించిందని ఆరోపించింది. 2008-11 మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగి 12 మంది మరణించారు. సరిహద్దుల్లో నివాసం ఉంటున్న వేలాదిమంది ఇళ్లు వదిలి పారిపోయారు.

## ఇదీ చరిత్ర

అటు థాయ్‌ల్యాండ్, ఇటు కంబోడియా.. రెండూ బౌద్ధ మతాన్నే. ప్రధానంగా అనుసరించే దేశాలే. సరిహద్దు వివాదంగా మారిన 'తా మోవాన్ థమ్' ఆలయానికి నిజానికి బౌద్ధంతో సంబంధం లేదు. ఓడ్డార్ మీన్‌చే ప్రాంతంలో ఉన్న ఒక పురాతన హిందూ ఆలయం ఇది. థాయ్‌ల్యాండ్-కంబోడియా సరిహద్దుకు సమీపంలో ఉన్న డెంగ్రిక్ పర్వత శ్రేణిలో ఉన్న ఈ ఆలయాన్ని ఖ్మెర్ సామ్రాజ్య కాలం (11వ-12వ శతాబ్దాల మధకచ) నాటి పాలకులు నిర్మించారు. ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ దేవాలయాల సముదాయం 'అంగ్‌కోర్‌వాట్' కూడా కంబోడియాలోనే ఉంది. అయితే సరిహద్దు వివాదానికి కేంద్ర బిందువుగా మారిన శివాలయం మాత్రం డాంగ్రిక్ పర్వత శిఖరంపై 400 మీటర్ల ఎత్తులో ఉంది. ఇక్కడ శివలింగంతో పాటు ఇతర హిందూ దేవతల విగ్రహాలు ఉన్నాయి. ఈ ఆలయ శిల్పకళ కూడా అంగ్‌కోర్‌వాట్ వంటి ఇతర ఖ్మెర్ ఆలయాల నిర్మాణ శైలిని పోలి ఉంటుంది. ఖ్మెర్ సామ్రాజ్య కాలంలో ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండేది. ఆలయం చుట్టూ ఉన్న సరిహద్దు ప్రాంతాలు వ్యూహాత్మకంగా కీలకమైనవి కావడంతో రెండు దేశాల సైనిక స్థావరాలు ఉన్నాయి. పర్యాటక ప్రాంతంగా ఒకప్పుడు విలసిల్లిన ఈ ప్రాంతానికి సైనిక కార్యకలాపాల కారణంగా పర్యాటకుల రాకపోకలు తగ్గిపోయాయి.






జలుమూరు మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నూతన ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, నూతన చైర్మన్ తత్ర బలరాం, వైస్‌చైర్మన్ డొక్కా వెంకటరమణ, డైరెక్టర్లు తత్ర లచ్చుము, వైశ్యరాజు జగదీశ్వరరావు,అంధవరపు ధర్మరాజు, లక్ష్మీపురం గడ్డయ్య, కోనారి రెయ్యమ్మ, సింగుపురం షణ్ముఖరావు, నందన మహేశ్వరరావు, వరుదు జ్యోతి, టెంక లక్ష్మి, యజ్జల సుశీల, కూన కరుణ, గార ఉషారాణి, రేగాన రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, నరసన్నపేట

## భవిష్యత్ పోరాటాలకు బీజేపీ సిద్ధంగా ఉండాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భవిష్యత్ పోరాటాలు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పటికీ పార్టీలో గౌరవం ఉంటుందన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రతి బీజేపీ కార్యకర్త కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సేవలు పార్టీకి మరింత బలాన్నిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ విజయానంద్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతి రావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అట్టాడ రవిబాబ్జి, మాజీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింతూ పాపారావు, సూరం నాయుడు తదితరులున్నారు.



## వెంకట అప్పలనాయుడుకు డాక్టరేట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాజీవ్ గాంధి వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట అప్పలనాయుడు డాక్టరేట్ పట్టా తీసుకున్నారు ఈయన స్వగ్రామం హిరమండలంలోని పింద్రూవాడ గ్రామం. వెంకటప్పలనాయుడు లైఫ్ సైన్సెస్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు. విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ఎన్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఈ పరిశోధన పూర్తి చేశారు. గత పదహారు సంవత్సరాల నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటీలో బయాలజీ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పట్టాపొందిన వెంకట అప్పలనాయుడుకు రిజిస్టర్ సంద్ర అమరేంద్ర కుమార్,డైరెక్టర్ బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు అభినందనలు తెలిపారు.




గోవా నూతన గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శనివారం కలిసి అభినందించారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం

## పేదరికం లేని సమాజం పీ4 సంకల్పం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదరికం లేని సమాజాన్ని సాధించడమే పీ4 లక్ష్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పేర్కొన్నారు. ఈమేరకు స్థానిక ఆదివారంపేట సచివాలయంలో అడ్మిన్ జ్ఞానేష్ ఆధ్వర్యంలో పీ4 పథకంపై సభ జరిగింది. సభలో పాల్గొన్న పీఎంజే బాబు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం పీ4 పథకం రూపొందించారని, అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించి ఉన్నత స్థితిలో ఉన్న పది శాతం మార్గదర్శకుల ద్వారా పేదరికంలో ఉన్న ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చాలనేదే పీ4 ప్రధాన లక్ష్యం అని తెలిపారు. పేదకుటుంబంలోని పిల్లలకు నాణ్యమైన విద్య, ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, అదేవిధంగా ఇతర అవసరాలకు చేయూత అందించడం పీ4 లక్ష్యమని, తద్వారా పేదరిక రహిత సమాజమే స్వర్ణాంధ్ర 2047 ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సచివా లయ అడ్మిన్ జ్ఞానేష్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 125 బంగా రు కుటుంబాలను గుర్తించామని వివరించారు. మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇంచార్జి అక్కేన రాజారావు, సచివాలయ సిబ్బంది శివాజీ, భారతి, వినీల, లక్ష్మి, శ్రీవనిత, ఆర్పీలు సంతు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనకు చిరునామా "టీడీపీ"

(సత్యంన్యూస్, గార)

సుపరిపాలనకు చిరునామ తెలుగుదేశం పార్టీ అని, రాష్ట్రంలో, శ్రీకాకుళం జిల్లాలో అభివృద్ధి శకం మొదలైందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు.శంకర్ శనివారం అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ, గార మండలం, గొంటి బలరాంపురం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగముగా ఎమ్మెల్యే గొండు. శంకర్ పర్యటించి మాట్లాడుతూ సుపరిపాలన టీడీపీతోనే సాధ్యమని, కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతీ గ్రామాన్ని పర్యటించి గ్రామ ప్రజల సమస్యలను తీరుస్తామని, ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరిస్తూ, సమస్యలపై ఆరాతీసారు. కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఎవరూ అధైర్య పడవద్దని, రానున్న కాలంలో అందరికీ మంచి జరుగుతుందన్నారు. ప్రజాసేవకే నేను రాజకీయంలోకి వచ్చానని, ప్రతీ కార్యకర్తకు, పార్టీతో సంబంధం లేకుండా ప్రజలందరి సమస్యలను నా భుజాన వేసుకొని, నా సమస్యగా భావించి పరిస్కారమయ్యేవిధంగా చూస్తానని, గ్రామ ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ముగ్ధుణ్ణయ్యానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష బృందం, ఇతర నాయకులు, ఇన్చార్జ్‌లు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## రక్తదాతలకు పాదాభివందనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రక్తదాతలకు పాదాభివందనమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కార్గిల్ విజయ్‌దివాస్‌లోభాగంగా ఎక్స్ సర్వీస్‌మేన్ జాయింట్ యాక్షన్ కమిటీ, బీహెచ్‌ఆర్సీ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఎక్స్ సర్వీస్‌మేన్ జాయింట్ ఆక్షన్ కమిటీ సేవలు అమూల్యమన్నారు. దేశ సేవచేసి, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తుండటం గొప్పవిషయమని, దేశసేవకు మించిన సేవ ఇంకేముందని, జై జవాన్ సేవలను కొనియాడారు. రక్త కొరత లేని జిల్లాగా, శ్రీకాకుళం నిలవాలని, కష్టతరమైనా సాధించి తీరుతామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు వచ్చి రక్తదానంపై అవగాహన కల్పిస్తే సాధ్యమవుతుందని, అవసరమైతే తాను కూడా బాగసౌమ్యున్ని అవుతూ, కీలకపాత్ర పోషిస్తానన్నారు. అనంతరం రక్తదాతలకు, ఎక్స్ సర్వీస్ మాన్ జాయింట్ ఆక్షన్ కమిటీ సబ్యులకు, బీహెచ్‌ఆర్సీ బృందానికి జ్ఞాపికను అందించి, దుస్సాలువాలతో సత్కరించారు.



## ఎస్పీని కలిసిన టెక్కలి డిఎస్పీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా శుక్రవారం టెక్కలి పోలీసు సబ్ డివిజన్‌లో డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.లక్ష్మణరావు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని ప్రజా ఫిర్యాదులు పరిష్కారం, మహిళా భద్రతకు ప్రాధన్యత ఇస్తూ, శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, మాదక ద్రవ్యాల అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నియంత్రణ, శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన తదితర అంశాలపై డిఎస్పీకి ఎస్పీ పలు సూచనలు చేశారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.